క్లుప్తంగా

అభివృద్ధి పనులకు భూమి పూజ



యనమదలలో షెల్టర్‌కు భూమి పూజ చేస్తున్న సూర్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: మండలంలోని యనమదలలో ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ ఎంపీ లాడ్స్ నిధుల నుంచి మంజూరు చేసిన అభివృద్ధి పనులకు ఆయన తనయుడు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ఆదివారం భూమి పూజ చేశారు. గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి, అంబేడ్కర్ విగ్రహం వద్ద షెల్టర్ నిర్మాణాలకు ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పంపన వీర వెంకటరమణ, ఉప సర్పంచ్ కొప్పుల శివ, ఎంపీటీసీ నురుకుర్తి శ్రీరామకృష్ణ, పార్టీ నాయకులు పెయ్యల భాస్కరరావు, కొప్పుల సూరిబాబు, మేకల గోపి, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ

రామచంద్రపురం రూరల్: రేషన్ స్మార్ట్ కార్డులను ద్రాక్షారామలో ఆదివారం పంపిణీ చేశారు. మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పెంకే అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శులు పెట్టా సత్యనారాయణ, అడపా వెంకట్, వీఆర్‌ఓ పరంజ్యోతి, రేషన్ డీలర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పెరుగుతున్న ధరలను నియంత్రించాలి

కాజులూరు: రోజురోజుకీ పెరిగిపోతున్న నిత్యావసర ధరలను ప్రభుత్వం నియంత్రించాలని రాష్ట్ర కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజుబాబు అన్నారు. ఆదివారం కాజులూరులో ఆయన మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలు, రైతులను లక్షాధికారులను చేస్తామని చెప్పి నిత్యావసర వస్తువుల ధరలను పెంచి వారి బతుకులను భారంగా చేసిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్, పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పడిపోయినప్పటికీ దేశంలో ఇంధన వినియోగంపై ట్యాక్సులు వేస్తూ ధరలు పెంచుతున్నారన్నారు. కార్పొరేట్ సంస్థల ప్రయోజనమే లక్ష్యంగా కాకుండా ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాలన సాగించాలన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘాల నాయకులు కురుపూడి భూచక్రం, మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



వెదురుపాకలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న రాయవరం ఎస్సై సురేష్‌బాబు

రాయవరం: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు సూచించారు. మండలంలోని వెదురుపాకలో ఆదివారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై సురేష్‌బాబు మాటాడుతూ ఎవరైనా కాల్ చేసి ఓటీపీ అడిగినా, లింక్స్ పంపించి క్లిక్ చేయాలని సూచించినా, ఆన్‌లైన్ జాబ్స్‌లో డబ్బులు పంపిస్తే మీకు రెట్టింపు డబ్బులు వస్తాయని చెప్పినా, ప్రొడక్ట్స్ వారు మీకు లాటరీ తగిలిందని, చార్జెస్ నిమిత్తం డబ్బులు పంపాలని చెప్పినా ప్రజలు నమ్మవద్దని సూచించారు. ఫేక్ లోన్ యాప్స్ జోలికి పోవద్దని, ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930కి కాల్ చేసి సంబంధిత వివరాలు చెప్పాలని సూచించారు. సైబర్ నేరం జరిగిన వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాయవరం ఏఎస్సై రాంబాబు, స్థానిక నేతలు శ్రీనివాస రెడ్డి, చంటిరెడ్డి, నాగిరెడ్డి, పండు, ఎం.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కాపవరంలో చైన్ స్నాచింగ్

రామచంద్రపురం రూరల్: మండలంలోని కాపవరం గ్రామంలో చైన్ స్నాచింగ్ సంఘటన చోటుచేసుకున్నట్టు ద్రాక్షారామ ఏఎస్సై ఎస్.ఎస్ భుజంగరావు ఆదివారం విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రంగంపేట మండలం కోటపాడుకి చెందిన దాసరి దుర్గారాణి భర్తతో కలసి రామచంద్రపురం మండలం ఉండూరులోని పుట్టింటికి ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో బయలుదేరారు. మధ్యలో బావారంలో వినాయకుడి గుడి వద్ద అన్నసమారాధన జరుగుతుంటే అక్కడ ఆగి భోజనం చేసి 12 గంటల సమయంలో తిరిగి బయలుదేరారు. కాపవరం గ్రామ శివారులో ఉన్న చెరువు వద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తి మోటారు సైకిల్‌పై వచ్చి ఆమె మెడలోని రెండున్నర కాసుల బంగారు పుస్తెల తాడు లాక్కొని వెళ్లిపోయాడు. దీంతో బాధితురాలు ద్రాక్షారామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

సాగులో సస్యరక్షణే కీలకం

- మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు
- వాతావరణ పరిస్థితులతో సతమతం
- రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు



ఎరువులు జల్లుతున్న రైతు

రామచంద్రపురం: మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో వరి సాగులో తెగుళ్ల బెడదతో రైతులు సతమతవుతున్నారు. ఉదయం వేడిమితో కూడిన ఎండ, మధ్యాహ్నం వర్షం, రాత్రి సమయంలో మంచుతో వరిసాగులో తెగుళ్ల సోకే అవకాశాలు అధికం. దీంతో రైతులు వరి సాగులో సరైన సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. పంటను ఆశించే తెగుళ్లను ముందస్తుగా గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని, లేదంటే నష్టాలు చవిచూడాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ఖరీఫ్ సాగు చేస్తున్న వరి పంట ప్రస్తుతం నాట్లు వేయగా పంట పచ్చగా ఉంటూ తెగుళ్లు సోకే అవకాశం ఉండటంతో వ్యవసాయ శాఖ సిబ్బంది సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అవసరమైన సలహాలు సూచనలు అందిస్తూ అన్నదాతకు అండగా నిలుస్తున్నారు. వ్యవసాయాధికారుల సూచనలివే.

జింక్ లోపం నివారణ

జింక్ లోపం ఉన్న పంటలో 3 లేదా4 ఆకులతో ఈనె పాలిపోతుంది. నాటిన 2 నుంచి ఆరు వారాల్లో ముదురాకు మధ్యలో ఈనెలక ఇరువైపులా తుప్పు రంగు మచ్చలు ఏర్పడి ఆకు పెలుసుగా ఉంటుంది. ఈ లక్షణాలు గుర్తించిన వెంటనే పైరుపై జింక్ సల్ఫేట్ ద్రావణం తగినంత మోతాదులో పిచికారీ చేసుకోవాలి.

కాండం తొలుచు పురుగు నివారణ

నారుమడి నుంచి పూత దశ వరకు వరి పంటకు కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉంది. పిలక దశలో మొవ్వు చనిపోవటం, పూత, దశలో తెల్లకంకులు ఏర్పడడం జరుగుతుంది. దీని వల్ల దిగుబడి బాగా తగ్గిపోతుంది. దీని నివారణకు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. కార్బొఫ్యూరాన్ 3 గ్రాముల గుళికలు ఎకరాకు పది కిలోలు వాడాలి. అలాగే, గొంగళి పురుగు ఆకుముడతలో ఉండి పత్రహరితాన్ని తినేయటం వల్ల ఆకులు తెల్లబడతాయి. దీని నివారణకు క్లోరిపైరిపాస్ 2.5 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి తగినంత మోతాదులు పిచికారీ చేసుకోవాలి. అలాగే సుడి దోమ వ్యాపిస్తే వరి పొలంలో దోమ ఉధృతి ఉన్న చోట పంట ఎండిపోతుంది. నివారణకు ట్రైసై క్లోజోల 0.6 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. గట్లపై కలుపు నివారించుకోవాలి.

బ్యాక్టీరియాతో ఆకు ఎండు తెగులు

బ్యాక్టీరియా వల్ల ఆకుకు ఎండు తెగులు వస్తుంది. నత్రజని ఎరువులు తక్కువ పరిమాణంలో ఎక్కువ సార్లు వేసుకోవాలి. పొలం ఆరబెడుతూ నీటి తడులు తగ్గిస్తూ వేసుకోవాలి.

పొట్టకుళ్లు తెగుళ్లతో తీవ్ర నష్టం

వెన్నులు పొట్టలోనే కుళ్లిపోతాయి. దీంతో పంటకు తీవ్ర నష్టం కలుగుతుంది. దీనిని నివారించేందుకు కార్బెండజోమ్ 1.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. పొట్ట దశలో ఒకసారి, వారం రోజుల తరువాత రెండో సారి పిచికారీ చేసుకోవాలి

> **యాజమాన్య పద్ధతులు పాటించాలి**
>
> 
>
> వాతావరణంలో ఏర్పడుతున్న మార్పులకు అనుగుణంగా రైతులు సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. వరి పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలి. నీటి యాజమాన్య పద్ధతులు ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలి. చిన్నపాటి మెళకువలు అనుసరించటం వల్ల పెట్టుబడులు తగ్గడంతోపాటు దిగుబడులు బాగుంటాయి. ఆర్బీకేల ద్వారా రైతులను చైతన్య పరుస్తున్నాం.
>
> – టీవీఆర్ మణిదీప్, వ్యవసాయాధికారి

నీరు ఉండేలా చర్యలు

పిలకలు వేసే దశలో పైరు దుబ్బు వేయటం పూర్తయ్యే వరకు పొలంలో 2 సెంటీ మీటర్ల నీరు ఉండాలి. చిరు పొట్ట దశలో, పూత దశలో పొలంలో 5 సెంటీ మీటర్ల నీరు ఉండేలా చూసుకోవాలి. పంట పూర్తిగా వెన్ను వచ్చిన తర్వాత క్రమంగా నీరు తగ్గిస్తూ ఉండాలి.

ఎరువుల యాజమాన్యం

భూసార పరీక్షలకు అనుగుణంగా రసాయన ఎరువులు, సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు వాడి పైరుకు సమతుల్యంగా పోషకాలను అందజేయాలి. ఎకరాకు నత్రజని 96 కిలోలు, భాస్వరం 32 కిలోలు, పొటాష్ 32 కిలోలు అందేలా ఎరువులు వేసుకోవాల్సి ఉంటుంది.

పంట పొలాలపై పందుల దాడి



తర్లంపూడిలో వరి మొక్కలను తింటున్న పందులు

కాజులూరు: మండలంలోని తర్లంపూడిలో పందుల స్వైర విహారం రోజురోజుకీ అధికమవుతోంది. గ్రామ వీధుల్లోనూ, ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్య కేంద్రం ఆవరణలోనూ యథేచ్ఛగా సంచరిస్తూ పరిసరాలను అస్తవ్యస్తం చేస్తూ వస్తున్న పందులు తాజాగా పంట పొలాలపైనా దాడి చేస్తుండటంతో పరిసర పొలాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పందులు పొలం మధ్యలోకి వెళ్లి చిగుర్లు వేస్తున్న వరి మొక్కలను కొరికితింటున్నాయి. ఈ సందర్భంలో పొలాన్ని తొక్కి చిందరవందర చేస్తున్నాయని రైతులు చెబుతున్నారు. తర్లంపూడి, జగన్నాథగిరి గ్రామాల సరిహద్దులో రహదారికి ఇరువైపులా కొందరు పందులను పెంచుతూ రాత్రి సమయాల్లో గ్రామంలోని పొలాల్లోకి వదులుతున్నారని రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ధనమ్మమర్రికి భక్తుల తాకిడి

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలో కొలువైన శ్రీధనమ్మ తల్లి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు రోజు కావడంతో విద్యార్థులు, ఉద్యోగులు, దూరపు ప్రాంతాల నుంచి పర్యాటకులు, అధిక సంఖ్యలో భక్తులు ధనమ్మ మర్రిని సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గోదావరి నదీ తీరంలో నడియాడుతూ ఆహ్లాదకరమైన అందాలను ఆశ్వాదించారు. అంగర పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

హిందీ భాష ఔన్నత్యాన్ని కాపాడుకోవాలి



మండపేటలో హిందీ పండిట్ ఫర్జానాను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కపిల్వేరపురం (మండపేట): హిందీ భాష ఔన్నత్యాన్ని కాపాడుకోవాలని పలువురు వక్తలు అన్నారు. మండపేట పట్టణంలోని వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం మహబూబ్ హిందీ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ హిందీ దివస్ నిర్వహించారు. 17 సంవత్సరాలుగా హిందీ అకాడమీని నడుపుతున్న హిందీ పండిట్ ఫర్జానాను ఘనంగా సత్కరించారు. బీజేపీ నాయకుడు కోన సత్యనారాయణ, హెచ్ఎం ఎల్. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫర్జానా కృషిని కొనియాడారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు మహమ్మద్ ఫాతిమా, షేక్ మహబూబ్ ఉన్నిషా, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కాలిబాట వంతెన



టేకిలో సగం కూలిపోయిన కాలిబాట వంతెనపై రాకపోకలు సాగిస్తున్న గ్రామస్తులు

కపిలేశ్వరపురం: మండలంలోని టేకి మురుగు కాలువపై ఉన్న కాలిబాట వంతెన ప్రమాదకరంగా మారింది. కొన్నేళ్ల క్రితం కాలిబాట వంతెన రక్షణ గోడ సగానికి విరిగిపోయి కాలువలోకి పడింది. దీంతో రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కొంతకాలానికి స్థానికులు స్పందించి విరిగిన భాగం వద్ద ఇటుకలతో రక్షణ గోడను నిర్మించుకున్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వంతెన దుస్థితి అలానే ఉంది. అసలే కాలిబాట వంతెన అందులోనూ సగం విరిగిపోయింది. మిగిలిన ముక్కపై రాకపోకలు సాగించాల్సి రావడంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని రైతులు ఈ వంతెన మీదుగా సమీప ఆయకట్టు వ్యవసాయ క్షేత్రానికి వెళతారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వంతెనను మెరుగుపర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సొంతూరుకు మేలు చేయడం సామాజిక బాధ్యత



పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

కపిలేశ్వరపురం: ఏదో ఒక రంగంలో ఆర్థికంగా ఎదిగిన వారు తాము పుట్టిన గ్రామానికి మేలు చేయడం సామాజిక బాధ్యత అని పలువురు వక్తలు అన్నారు. కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త గన్నమని ఆనందరావు శత జయంతి వేడుకలు ఆదివారం గ్రామంలో నిర్వహించారు. నిర్వాహక కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఆనందరావు కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. అమలాపురం ఎంపీ జీఎంసీ హరీష్‌మాథుర్, మండపేట, గాజువాక ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, పల్లా శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆనందరావు, ఆయన కుటుంబ సభ్యులు చేసిన సేవలను కొనియాడారు. గ్రంథాలయంలో ఆనందరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆనందరావు కుటుంబీకులు సమకూర్చిన కంప్యూటర్ ల్యాబ్, సీహెచ్‌సీలో 2డీ ఎకో, థైరాయిడ్ మెషీన్, ఇతర వైద్య పరికరాలను ప్రారంభించారు. కార్యక్రమలో సర్పంచ్ శాకా శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు శీలం భాస్కరరావు, గొల్లపల్లి సోనియా, పారిశ్రామికవేత్తలు గన్నమని మురళీకృష్ణ, మోహనరావు పాల్గొన్నారు.

దంగేరులో అపూర్వ కలయిక



పాఠశాల ఆవరణలో గురువులతో పూర్వ విద్యార్థులు

కె.గంగవరం: మండలంలోని దంగేరు ఉన్నత పాఠశాలలో 1970–1975 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయంగా కలుసుకొని ఉల్లాసంగా గడిపారు. అప్పట్లో చదువుకున్న పూర్వ విద్యార్థుల్లో కొంత మంది ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్న మాజీ ఉపాధ్యాయులే. తొలుత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులందరూ కలసి సహపక్తి భోజనాలు చేసి గడిచిన మధుర జ్ఞాపకాలను మళ్లీ గుర్తు చేసుకొని సంతోషం వ్యక్తం చేశారు. వీలైనంత వరకూ ఏటా కలుసుకునేందుకు ప్రయత్నిస్తామని, తమకు విద్యాబోధన నేర్పిన పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సూరిబాబు, మాజీ సర్పంచ్ రావిపాటి వెంకట గణేష్, ఉపాధ్యాయులు నేదునూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం

కపిలేశ్వరపురం: అంగర పల్లపువీధి రామాలయం వద్ద నిర్వహించే దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలకు ఆదివారం పందిరి రాట వేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పురోహితుడు వారణాసి వెంకటేశ్వరరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం చేశారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తుల సహకారంలో ఏటా దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

మారేడుబాకలో..

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం మారేడుబాకలో ఆదివారం శరన్నవరాత్ర ఉత్సవాలకు పందిరి రాట వేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విజయ దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం చేశారు. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకూ దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలకు ఆదివారం రాట ముహూర్తం నిర్వహించారు. మాణిక్యాంబ అమ్మవారి సన్నిధిలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 4 వరకు శరన్నవరాత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ అల్లు వెంకట దుర్గాభవాని తెలిపారు. ఈఓ, ఆలయ అర్చకులు, వేద పండితులు, వైదిక సిబ్బంది వేద మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి రాట ముహూర్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, రాంబాబు దంపతులు, మంత్రి సుభాష్ తల్లిదండ్రులు సత్యం, కృష్ణవేణి దంపతులు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పెంకే అన్నపూర్ణ, సాంబశివరావు దంపతులు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



అంగరలో రాట ముహూర్తం పూజలు చేస్తున్న పండితులు



భీమేశ్వరాలయ ప్రాంగణంలో రాట ముహూర్తం చేస్తున్న ఈఓ దుర్గా భవానీ తదితరులు

రాయవరం: మండలంలోని లొల్ల గ్రామంలో ఆదివారం దేవీ నవరాత్ర ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ నెల 22 నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక దుర్గమ్మ తల్లి ఆలయం వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు రాట ముహూర్తం చేశారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు బోగిళ్ల సతీష్‌కుమార్, సుంకవిల్లి గంగరాజు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చంద్రాల గనిరాజు, వైట్ల ప్రసాద్, ముప్పాటి కృష్ణ, చాట్రాతి సూర్యచంద్రభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అంచు దాటితే అంతే సంగతులు

- కోతకు గురవుతున్న రోడ్లు
- ప్రమాదాల బారిన ప్రయాణికులు



మల్లవరం వంతెన వద్ద కోతకు గురైన మలుపు



యర్రపోతవరం వంతెన వద్ద ప్రమాదకరంగా రోడ్డు అంచు

కె.గంగవరం: ఆదమరిచి అంచుదాటి ప్రయాణిస్తే ఆసుపత్రి పాలవ్వాల్సిందే. మండలంలోని పలు గ్రామాల్లో గ్రామీణ ప్రాంత రహదారులు కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. మండలంలోని యర్రపోతవరం వంతెన వద్ద నుంచి ఊరి చివరి వరకు ఉన్న రహదారి మరీ అధ్వానంతో ప్రమాదాలకు నిలయంగా మారిందని గ్రామస్తులు అంటున్నారు. కూళ్ల పంచాయితీ శివారు మల్లవరం వద్ద ఉన్న వంతెనకు అప్రోచ్ లేకపోవడంతో ప్రమాదకరంగా ఉంది. దీంతో పాటు పామర్రు– కురకాళ్లపల్లి, దంగేరు– పేకేరు, మల్లవరం– కూళ్ల, నరజాడ– అముజూరు రహదారులు కోతకు గురై ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇటీవల ఏటిగట్టుపై ప్రయాణిస్తున్న వాహనదారుడు గొయ్యిని తప్పించబోయి రోడ్డు ప్రక్కనే ఉన్న గోతులో పడి వాహనచోదకుడు మృతి చెందాడు. మల్లవరం గ్రామం వద్ద ఉన్న వంతెనకు అప్రోచ్ లేకపోవడం వల్ల ఇటీవల బైక్‌పై వెళుతున్న రావులపాలెనికి చెందిన వ్యక్తి గోతులో పడి మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్రగాయలయ్యాయి. కోటిపల్లి–కోట రహదారిలో ఏటిగట్టుకు అప్రోచ్ లేకపోవడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా తుప్పలు ఉండటం వల్ల రెండు నెలల్లో సుమారు 10 మంది వరకు గాయాలపాలయ్యారు.